క్లుప్తంగా

వాహనాల తనిఖీ



మానవపాడు: వాహనాదారులు ప్రతి ఒక్కరూ నంబర్ ప్లేట్‌లను కలిగి ఉండాలని ఎస్ఐ రాము సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ చేయరాదని ఆదేశించారు. పలు వాహనదారులకు నంబర్ ప్లేట్లపై సూచనలు అందించారు.

అడవులను పెంచాలి



గద్వాల అర్బన్: పక్షులు అంతరించిపోకుండా అడవులను పెంచాల్సిన అవసరం ఉందని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ పక్షుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భావితరాలకు అన్ని జాతుల పక్షులను చూయించాలంటే వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, లవీన మంజులత, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంపాటి నాగేందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలోని వృక్షజాలంపై పాలినోటాక్సొనామికల్ అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రముఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందుకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలలో రాంపాటి నాగేందర్‌కు ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాష, అధ్యాపక బృందం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు.

ఎస్‌జీటీయూ కమిటీ ఏర్పాటు



గట్టు: ఎస్‌జీటీయూ మండల కమిటీ శుక్రవారం ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా హనుమంతునాయక్, అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా సద్దాం హుస్సేన్, దామోదర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా పరశురాముడు, కార్యదర్శి వర్గ సభ్యులుగా నాగరాజు, విజయసింహాచారి, ఆంజనేయులు, రాజు, కిశోర్, అశోక్‌కుమార్, రంగస్వామి, వెంకట్రాముడు, విశ్వతేజ, శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతయ్య, ఏమినా నాయక్, వెంకటయ్య, సోమసుందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సంతోష్‌ను శుక్రవారం అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకె అందించి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట సోమనాద్రి, వెంకటేష్ యాదవ్, మద్దిలేటి, ఈదన్న, భాస్కర్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌లు అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఆయా గ్రామాలకు చెందిన పలువురు తమ మొబైల్ ఫోన్‌లు పోయాయని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీస్ సాంకేతిక పరి/జ్ఞానంతో వాటిని గుర్తించి శుక్రవారం బాధితులకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గట్టు: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు అధికారులు ఉచితంగా ఇవ్వనున్నట్లు గద్వాల ఆర్డీఓ చంద్రకళ తెలిపారు. శుక్రవారం తప్పెట్లమొర్సులో తహసీల్దార్ ధనుంజయ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ఆర్డీఓ హాజరయ్యారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. మొత్తం 2,124 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

అయిజ: మున్సిపాలిటీలో అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి 20 వార్డుల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపాలిటీలో మొత్తం 544 దరఖాస్తులు వచ్చాయి. కమిషనర్ నిత్యానంద్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలోని భూంపురంలో 614, కొత్తపల్లిలో 604, మూగోనిపల్లిలో 206, తొత్తినోనిదొడ్డిలో 613 దరఖాస్తులు వచ్చాయి.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, తక్కశీలలో ప్రజాపాలనకు ఎమ్మెల్యే విజేయుడు హాజరై దరఖాస్తులను స్వీకరించారు. గ్రామీణ ప్రాంతాలలో అధికారులు సహకరించాలని సూచించారు. పుల్లూరులో 1,056, తక్కశీలలో 1,135 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, తహసీల్దార్ వెంకట్రావ్, నాయకలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని మద్దూరులో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. శనివారం ప్రతి గ్రామంలో దరఖాస్తులు ఇవ్వని వారు తప్పకుండా అందించాలని అధికారులు కోరారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు

కేటీదొడ్డి: మండలంలోని ఎర్సందొడ్డి, కొండాపురంలో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమానికి వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు హాజరై అధికారులతో కలిసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు.రెండు గ్రామాలు కలిపి 833 దరఖాస్తులు వచ్చాయి.

నేడు దరఖాస్తుల స్వీకరణ

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాల, ఉమిత్యాల తండా, మల్లాపురం, మల్లాపురంతండా పంచాయతీల్లో శనివారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తహసీల్దార్ సరితరాణి, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహీద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పంచాయతీల ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

ధరూరు: అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ నజీమున్నీసా బేగం అన్నారు. శుక్రవారం మండలంలోని అల్వలపాడు, మాల్‌దొడ్డిలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాలను వారు సందర్శించారు. అల్వలపాడులో 660, మాల్‌దొడ్డిలో 203, నీలహళ్లిలో 266, ద్యాగదొడ్డిలో 182 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

2,361 దరఖాస్తులు

మల్దకల్: మండలంలోని ఎల్కూరు, పాల్వాయిలో నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు 2,361 దరఖాస్తులను స్వీకరించారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో చివరి రోజు శుక్రవారం 1,504 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మంజుల, ఎంపీఓ చంద్రకళ తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటిక్యాలలో 837, షాబాద్‌లో 914, రాజశ్రీ గార్లపాడులో 830, వల్లూరులో 927 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, నందిని, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ భాస్కర్ ఉన్నారు.



తప్పెట్లమొర్సులో దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీఓ చంద్రకళ



పుల్లూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు



వల్లూరులో..



అయిజలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ సాయిప్రకాష్



కేటీదొడ్డిలో..



మల్దకల్ మండలం పాల్వాయిలో..



ధరూరులో..

తప్పిపోయిన బాలుడి అప్పగింత

గద్వాల క్రైం: పాఠశాలకు వెళ్లకుండా రైలెక్కి రాయచూర్‌కు వెళ్లిన బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన శుక్రవారం రైల్వే పోలీసుస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలుడు, గురువారం ఉదయం స్కూల్ వెళ్లకుండా గద్వాల రైల్వే స్టేషన్‌కు చేరుకుని రాయచూర్‌కు వెళ్తున్న రైలెక్కాడు. ఈ క్రమంలో తల్లికి ఫోన్ చేసి హైదరాబాద్ వెళ్తున్నానని.. ప్రస్తుతం రైలు జడ్చర్ల స్టేషన్‌లో ఉందంటూ వారికి చెప్పాడు. దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. హైదరాబాద్ మీదుగా వెళ్తున్న పలు రైళ్లలో తనిఖీ చేయగా ఫలితం లేకపోయింది. విద్యార్థితో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా లొకేషన్ గుర్తించగా రాయచూర్ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడి ఆర్‌పీఎఫ్ సిబ్బంది సాయంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో చదువుతుండగా, తల్లిదండ్రులు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడం, ఇక్కడ చదువకోవడం ఇష్టం లేక మనస్తాపం చెందినట్లు తెలిపారు. తండ్రి జిల్లాలోని మున్సిపల్ అధికారి కుమారుడుగా గుర్తించి వారికి అప్పగించినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు.

పైపులైన్ లీకేజీలను పట్టించుకోరా?



సుంకులమ్మ మెట్టు-గంజిపేట రోడ్డులో పైపు లీకేజీ అవుతూ రోడ్డుపై ప్రవాహిస్తున్న నీరు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో సుంకులమ్మ మెట్టు -గంజిపేటకు వేళ్లే దారిలోని పైపు లీకేజీ అవుతూ తాగునీరు వృథాగా వెళ్తుంది. నీటి సరఫరా సమయంలో రోడ్డుపై బురదమయంగా కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ లీకేజీతో తాగునీరు కూడా కలుషితమయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఒకేచోట పలుమార్లు మరమ్మతులు చేసినా.. సమస్య పునరావృతమవుతుంది. ఈ లీకేజీ నివారించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మధ్యలో గుంత తవ్వి సమీపంలోని ఓ పెద్ద భవనానికి నల్లా కనెక్షన్ ఇచ్చినప్పటి నుంచే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత వెంటనే అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న వివేకానంద యూత్ సభ్యులు

అలంపూర్: పటణంలోని వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాసం, వివేకానంద వేషధారణ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు యూత్ అధ్యక్షుడు రజని బాబు తెలిపారు. ఈ నెల 12 పోటీలు నిర్వహిస్తామని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతులకు క్విజ్, చిత్రలేఖనం, ఇంటర్ విద్యార్థులకు ఉపన్యాసం, చిన్న పిల్లలకు వేషధారణ పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ అశోక్‌కు వినతిని అందజేశారు..

నేటి నుంచి అబ్దుల్ ఖాదర్ షా దర్గా ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అబ్దుల్‌ఖాదర్ షా దర్గా ఉర్సుకు ఘనమైన చరిత్ర ఉంది. సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా మజీజూబ్ ఓ సాధారణ పోలీస్ కానిస్టేబుల్. 1929లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ముస్లిం పెద్దలు చెబుతున్నారు. ఖాదర్‌షా మరణానంతరం అతడి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు 1939లో రాయచూర్ రోడ్డు పక్కన నిర్మించిన ఆయన సమాధిపై ఓ దర్గాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కులమతాలకతీతంగా ప్రజలు దర్శించుకుంటున్నారు.

నేటి నుంచి ఉర్సు

ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వేడుకులకు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. 6న సాయంత్రం 8 గంటలకు జలాభిషేకం (గుసుల్ షరీఫ్), 7న ఉర్సు వేడుకల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవం నిర్వహించనున్నారు. 8న దీపారాధన, 9న జ్యారత్ ఫాతేహాతో ఉత్సవాలు ముగుస్తాయి.

మెరుగైన విద్యను అందించాలి

మానవపాడు: విద్యార్థులకు మెరుగైనా విద్యను అందించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే విజేయుడు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. ఆయా తరగతి గదులలో ప్రతి విద్యార్థి నైపుణ్యం వెలికి తీసి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించేలా పట్టుదల, సంకల్ప బలం పెంపొందించాలని సూచించారు. ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కబడ్డీ విజేతగా ఇడుపనూరు జట్టు

గట్టు: మండలంలోని బోయలగూడెంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఫైనల్ విజేతగా కర్ణాటకకు చెందిన ఇడపనూరు జట్టు నిలిచి మొదటి బహుమతి రూ.20 వేలను దక్కించుకున్నారు. ద్వితీయ బహుమతిని పచ్చర్ల టీం, తృతీయ బహుమతిని మల్కాపురం టీం దక్కించుకుంది. విజేతలకు వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచ్ రాణి, నాయకులు బహుమతులను అందజేశారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

మానవపాడు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో బీజేపీ మండల కార్యాలయాన్ని శుక్రవారం బంగారుశృతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. చెన్నిపాడు, మానవపాడులో బీజేపీ జెండా ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో మురళీ, కుర్మన్న, వెంకటపతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల పంపిణీ

అయిజ: పట్టణంలో బీజేపీ నాయకులు శుక్రవారం మా సంకల్పం వికసిత భారత్ యాత్రను ప్రారంభించారు. అదేవిధంగా వికసిత భారత్ - 2024 క్యాలెండర్లను ప్రజలకు అందజేశారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ మాట్లాడారు. దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేని కలిసిన వాల్మీకి నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు వాల్మీకి నాయకులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను కలిశారు. ఎల్కూరు శ్రీను, మధునాయుడు ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సత్కరించారు.

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ: మండల కేంద్రంలో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్లను ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సంఘంగా టీఎస్ యూటీఎఫ్ ఉన్నదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, ఏరియర్లు, ఇతర సప్లిమెంటరీ బిల్లులను సత్వరమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీఓను వెంటనే రద్దు చేయాలని, స్థానికతను ఆధారం చేసుకొని సర్దుబాటు చేయాలని, ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దయాల్ రాములు, గోపాల్, రాజశేఖర్, సురేష్, ప్రశాంత్, అబ్దుల్లా పాల్గొన్నారు.

గ్రామాలకు దారి ఏర్పాటు చేయండి



రోడ్డు పనుల వద్ద నిరసన తెలుపుతున్న ఆయా గ్రామాల ప్రజలు

అయిజ: భారత్ మాల రోడ్డు నిర్మాణంలో అయిజ, పర్థిపురం, ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాలకు వెళ్లే దారులు మూసుకపోతున్నాయని రహదారులను ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు అయిజ శివారులో నిర్మిస్తున్న భారత మాల రోడ్డు పనుల వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. అయిజ శివారులో మూడు గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రహదారులను మూసివేస్తూ భారత మాల రోడ్డు నిర్మాణం చేపట్టారని, దీంతో గ్రామాలకు, పంట పొలాలకు వెళ్లేదారులు లేకుండా పోతాయని వాపోయారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించి ఆయా గ్రామాలకు దారులను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డు నిర్మిస్తే అడ్డుకుంటామని, ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్‌కు సంబంధించిన ఉద్యోగులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ప్రజలు శాంతించారు.

చాగదోణలో అక్షతల పంపిణీ



చాగదోణలో అక్షతల ఊరేగింపు

గట్టు: మండలంలోని చాగదోణలో శ్రీరామ అక్షతలను శుక్రవారం గ్రామంలో ఊరేగించారు. గ్రామానికి చెందిన శ్రీరామ భక్తులు గ్రామంలో ఊరేగింపు ఇంటింటికీ వెళ్లి అక్షతలను పంపిణీ చేశారు. ఈ నెల 22న ప్రతి కుటుంబం ఇంట్లో దీపం వెలిగించాలని కోరారు.

ధరూరు: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ, శివాలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో పుర వీధుల గుండా తిరుగుతూ.. అయోధ్య నుంచి వచ్చిన తలంబ్రాలను ప్రతి గడపకు చేర్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని ఆలయాలకు ర్యాలీగా వెళ్లి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు అక్షతల శోభాయాత్ర

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో శనివారం అయోధ్య రాముడి అక్షతల వితరణ కార్యక్రమంలో భాగంగా శోభయాత్ర నిర్వహిస్తున్నట్టు వీహెచ్‌పీ ప్రతినిధులు బాలబ్రహ్మేశ్వర రెడ్డి, జగదీష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అక్షతలు అలంపూర్ చేరుకున్నాయని, సాయంత్రం 4 గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి జోగుళాంబ ఆలయం వరకు శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

గట్టు: చెన్నకేశవస్వామి, లక్ష్మీదేవీ, భూదేవీల కల్యాణానికి మాచర్ల చెరువు కట్ట కింద ఉన్న లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం వేదికగా మారింది. మాచర్లలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం పల్లకీసేవతో గ్రామంలోని కుమ్మరి వీధికి చేరుకుని కొత్త కుండలను దేవాలయానికి తీసుకువచ్చారు. స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాన్ని నిర్వహించారు. 11 గంటలకు కలశ స్థాపన చేశారు. మధ్యాహ్నం దేవాలయంలో ప్రత్యేకంగా పందిరి వేసి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ఉత్సాహంగా ప్రభోత్సవం

శనివారం రాత్రి ప్రభోత్సవాన్ని నిర్వహించారు. ప్రభ వాహనంపై చెన్నకేశవస్వామి ఆశీనులు కాగా భక్తులు వాహనాన్ని లాగారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు అభిషేకం, కుంకుమార్చన చేశారు. అదేవిధంగా ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

అందని పశువైద్యం

- పేరుకే పశు వైద్యశాలలు..
  సేవల్లో మాత్రం శూన్యం

ధరూరు: మండలంలో పశువైద్యం దైవాధీనంగా తయారైంది. జిల్లా ఏర్పాటు తరుణంలో చురుగ్గా పని చేసిన ఆశాఖ అధికారులు ఇటీవల విధులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. దీంతో అన్నదాతల పశు సంపదకు ఏ రోగమొచ్చినా భయాందోళనకు గురి కావాల్సిన పరిస్థితి దాపురించింది. ఇక్కడకు కాంట్రాక్ట్ బేసిక్‌లో వచ్చిన వీఏఎస్ మూడు నెలలుగా మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. సిబ్బంది కూడా అందుబాటులో ఉండడం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి ధరూరుకు వచ్చే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఏడాదిన్నర క్రితం మన్నాపురం చెందిన రైతు మల్దకల్ తన పాడి గేదెను వైద్యం నిమిత్తం ధరూరుకు తెచ్చినా సిబ్బంది అందుబాటులో లేక చనిపోయిన విషయం తెలిసిందే.

సంచార వాహనాలు, గోపాల మిత్రలే దిక్కు..

పశు వైద్యశాలలు, సబ్ సెంటర్లలో సరైన సిబ్బంది లేక పూర్తిస్థాయిలో సేవలందడం లేదు. దీంతో పాడి రైతులు 1962 పేరుతో వచ్చిన సంచార వాహనాలను, గోపాలమిత్రలను ఆశ్రయించి వైద్యం చేయిస్తున్నారు. కొంత వరకు వీటితో సమస్య కాస్త తీరుతోంది. పశు వైద్య శాఖలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సిబ్బంది కొరత..

మండల కేంద్రంలో ఉన్న పశు వైద్య శాలలో సిబ్బంది కొరత ఉంది. ప్రధానంగా డాక్టర్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గట్టు మండలం ఆలూరులో రెగ్యూలర్‌గా విధులు నిర్వహిస్తున్న వెటర్నిరీ వైద్యుడు శంకరయ్యకు ధరూరు, గద్వాల మండలాలను ఇన్‌చార్జ్ ఇచ్చారు. సబ్ సెంటర్‌లైనా చింతరేవుల, అల్వలపాడులో జేవీఓలు మాత్రమే ఉన్నారు. ఇక్కడ అటెండర్లు లేరు. ఇక ఉప్పేరులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు.

అధికారి వివరణ..

ఈ విషయమై మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి శంకరయ్యను వివరణ కోరగా.. డాక్టర్ వరలక్ష్మి మెటర్నిటీ లీవ్‌లో ఉండడంతో తనకు మూడు నెలల క్రితం ధరూరు మండల ఇన్‌చార్జ్‌గా బాధ్యతు ఇచ్చారని తెలిపారు. రెతులకు ఇబ్బందులు కలగకుండా చూడడంతో పాటు మూగ జీవాలకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.



ధరూరు పశు వైద్యశాల